క్లుప్తంగా

అనూషకు కలాం విశిష్ట సేవా పురస్కారం


పురస్కారం అందుకున్న అనూష

రాయదుర్గం టౌన్: పట్టణానికి చెందిన అనూషకు కలాం విశిష్ట సేవా పురస్కారం దక్కింది. శ్రీరామ్ ఫౌండేషన్ ద్వారా అనూష అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించి కలాం ట్రస్ట్.. సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. ఇటీవల తిరుపతి మహతి ఆడిటోరియంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలాం ట్రస్ట్ నిర్వాహకులు సేవా పురస్కారాన్ని అందించినట్లు అనూష తెలిపారు.

పెండింగ్ ఫీజులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులు తక్షణం విడుదల చేయాలని, ఫీజులు కడితేనే పరీక్షలు రాయిస్తామని విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేయడం మానుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బకాయి ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయాలన్నారు. నవంబర్‌లో డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. పెండింగ్ ఫీజులు చెల్లిస్తే పరీక్షలు రాయిస్తామని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు చెప్పారు. తక్షణం బకాయి ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం


కేవీకేలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: వ్యవసాయ రంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కేవీకేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ సెకండియర్ విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలు, పండ్ల మొక్కలు, ఆహారధాన్యాలు కోళ్ల పెంపకం, సస్యరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మల్లికార్జున, యుగంధర్, హరిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


స్టెప్పులు అదరగొడుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ 9 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం ఎన్‌సీసీ అధికారుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినీ, జానపద, దేశభక్తి పాటలకు క్యాడెట్లు చేసిన డ్యాన్సులు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా క్యాడెట్లను ఉద్దేశించి క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు, అనంతపురం, నంద్యాల, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 530 మంది క్యాడెట్స్, సుబేధర్ ఎంఆర్ బాషా, ఎన్‌సీసీ అధికారులు దయామణి, హేమ దుర్గా, గంగన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టోర్ డీలర్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

బొమ్మనహాళ్: మండలంలోని రేషన్ స్టోర్ డీలర్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ మునివేలు సమక్షంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా పయ్యావుల మోహన్, ఉపాధ్యక్షుడిగా కురుబ తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారి ప్రభయ్య స్వామితో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

నీటితో కళకళలాడుతున్న బీటీ ప్రాజెక్ట్



6వ గేటు తెరిచి దిగువకు నీరు వదులుతున్న దృశ్యం



చిగురిస్తున్న ఆశలు !

- నిండుకుండలా బీటీ ప్రాజెక్ట్
- 2,200 క్యూసెక్కులతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- దిగువకు 810 క్యూసెక్కుల నీరు విడుదల
- సుమారు 5 వేల ఎకరాలు సాగులోకి తెచ్చేలా అధికారుల ప్రణాళిక

రాయదుర్గం: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో వేదావతి హగరి పరవళ్లు తొక్కింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1655 అడుగులు కాగా బుధవారం తెల్లారేసరికి 1654.2 అడుగులకు వరదనీరు వచ్చి చేరాయి. రిజర్వాయర్‌లోకి సుమారు 2,200 క్యూసెక్కులతో ఇన్‌ఫ్లో కొనసాగింది. అప్రమత్తమైన అధికారులు మంగళవారం రాత్రి 6వ గేటు అడుగుమేర తెరిచి దిగువకు 810 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

బీటీపీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. 2022–23 రబీ తర్వాత లోటు వర్షపాతం కారణంగా 2024 ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీరందలేదు. ప్రస్తుతం బీటీపీ జలకళను సంతరించుకోవడంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో సుమారు 5 వేల ఎకరాలు సాగులోకి తెచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ ఇతర ప్రాజెక్టుల పరిధిలో లేని విధంగా బీటీపీ నీటిని రొటేషన్ పద్ధతిలో రైతులు సాగుకు వినియోగిస్తున్నారు. గుమ్మఘట్ట మండలంలోని ఎడమ కాలువ పరిధిలో 8,400 ఎకరాలు, బ్రహ్మసముద్రం మండలంలోని కుడి కాలువ ద్వారా 4 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు. 2023 రబీలో ప్రధాన ఎడమ కాలువ ద్వారా 01 నుంచి 14 డిస్ట్రీబ్యూటర్ల వరకు 5,300, కుడి కాలువ ద్వారా 6ఏ నుంచి 8బీ డిస్ట్రిబ్యూటర్ల వరకు 1800 ఎకరాలకు సాగునీరందించారు. ప్రస్తుత రబీలో ఎడమ కాలువ ద్వారా సుమారు 3 వేలు, కుడి కాలువ ద్వారా 2 వేలు ఎకరాలకు సాగునీరందించేలా కసరత్తు చేపట్టారు.

చెరువులు నింపితేనే ప్రయోజనం

లోటు వర్షపాతం కారణంగా భూగర్భజలాలు పాతాళానికి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీటీప్రాజెక్ట్ నీటిని వృథాగా వేదావతి హగరిపాలు కాకుండా ముందుగా గుమ్మఘట్ట కేవీ ట్యాంకు, కలుగోడు, భూపసముద్రం చెరువులు నింపితే ప్రయోజనం చేకూరడంతో పాటు తాగునీటి కష్టాలు తీరతాయని స్థానికులు చెబుతున్నారు.

అధ్వానంగా ప్రధాన కాలువలు

గత 20 రోజులుగా ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో మొదలైంది. ఐనా అధికారులు, పాలకుల్లో చిత్తశుద్ధి కరువైంది. ప్రధాన 7వ గేటు వద్ద రబ్బర్ సీల్ లీకైంది. ఎడమకాలువ హెడ్‌స్లూయిస్ కింద నీటి వృథా ఎక్కువైంది. వాటిని అరికట్టాలని రైతులు మొరపెట్టుకున్నా నిధుల కొరత పేరుతో అధికారులు, పాలకులు మీనమేషాలు లెక్కించారు. తీరా కాలువల ద్వారా నీటిని చెరువులు, ఆ తర్వాత ఆయకట్టుకు మళ్లించే సమయం ఆసన్నమైనా ముందస్తు చర్యలు చేపట్టలేదు. దీంతో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు పలుచోట్ల ప్రధాన కాలువ దారుణంగా దెబ్బతింది. సత్వరం వాటి మరమ్మతుల పై దృష్టి సారించాల్సి ఉంది. తూములు, వాటి షెట్టర్లు రిపేరి చేయాల్సి ఉంది.

సాగునీరు అందిస్తాం



బీటీ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరదనీరు వచ్చి చేరింది. రొటేషన్ పద్ధతిలో ఎడమ, కుడి కాలువ పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాలకు నీరందించేలా కార్యాచరణ చేపట్టాం. 6వ గేటు ద్వారా హగరికి విడుదల చేసిన నీటిని చెరువులకు మళ్లిస్తాం. ఇన్‌ఫ్లో కొనసాగితే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తాం. కాలువ మరమ్మతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

– బలరాముడు, మైనర్ ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

ఏకపక్షంగా చేపల చెరువు వేలం

కుందుర్పి: శ్రీమజ్జనపల్లి చేపల చెరువు వేలం పాటను టీడీపీలో ఓవర్గం వారు బుధవారం ఏకపక్షంగా నిర్వహించినట్లు అదే గ్రామానికి చెందిన మరో వర్గం వారు ఎంపీడీఓ బాలాజీకి ఫిర్యాదు చేశారు. స్థానిక సర్పంచ్ గోవిందమ్మ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుకు సైతం సమాచారం ఇవ్వకుండా కొంతమంది టీడీపీ నాయకులు రూ.57,500 కు ఏకపక్షంగా చేపల చెరువు వేలం వేసినట్లు టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, శ్రీమజ్జనపల్లి వాసి ముక్కా హనుమయ్య అధికారులకు ఫిర్యాదు చేశాడు. వేలం పాటలో తీసుకొన్న పైనిధులు పంచాయతీకి అప్పగిస్తారా లేక టీడీపీ నాయకులు సొంత ఖర్చులకు వాడుకొంటారా తెలపాలని ఆయన ఎంపీడీఓను ప్రశ్నించారు. మండల అధికారులు చర్యలు తీసుకోకపోతే సర్పంచ్‌తో కలసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎంపీటీసీ పేర్కొన్నారు.

ఆలయంలోకి వర్షపునీరు


భవాని శంకర్ ఆలయ గర్భగుడిలో చేరిన వర్షపునీరు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అతి పురాతన భవాని శంకర ఆలయంలో బుధవారం వర్షపు నీరు చేరింది. గర్భగుడిలోని శివలింగాన్ని వర్షపునీరు చుట్టుముట్టింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆలయ ప్రాంగణమంతా జలమయమవుతోంది. ఇలాగా కొనసాగితే ఆలయానికి ముప్పుతప్పదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'డ్రిప్' వాడకంతో నీటి ఆదా


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్

కూడేరు: పంటల సాగులో డ్రిప్, స్ప్రింక్లర్లు వాడితే నీరు ఆదావుతుంది. తద్వారా పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందుతుందని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పి.నారాయణపురం, ఎంఎంహళ్లిలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. డ్రిప్ వాడకంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి విజయ కుమార్ మాట్లాడుతూ.. ఆముదం, కంది, వేరుశనగ పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. మిగిలిన శాఖల అధికారులు వారి శాఖలోని పథకాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, వీహెచ్ఏ ప్రమోద్ సాయి, వీఏహెచ్ఏ సర్దార్ బాషా, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్ మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ అధ్యక్షుడు హరున్‌రషీద్ డిమాండ్ చేశారు. బుధవారం పెండింగ్ ఫీజురియింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, రూ.1,400 కోట్ల వసతిదీవెన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

ఉద్యాన పంటల పరిశీలన


రామసాగరం వద్ద అరటి తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ శాస్త్రవేత్తలు

బెళుగుప్ప: మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ పరిసర ప్రాంతంతో పాటు బూదిగుమ్మ రామసాగరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను వ్యవసాయ శాస్త్రవేత్త యుగంధర్, ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ బుధవారం పరిశీలించారు. కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు అందించాలనే లక్ష్యంతో అధికారులు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. అరటి పంటను పరిశీలించి సిగటోక ఆకుమచ్చ తెగులు, చీడపీడల నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. చీనీ, బొప్పాయి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. అనంతరం స్థానిక ఆర్ఎస్‌కేలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ–పంట నమోదు, ఉద్యాన పంటల్లో ఒక హెక్టార్‌కు రాయితీ, సబ్సిడీ తైవాన్ స్ప్రేయర్లపై అవగాహన కల్పించారు.

పంటలకు అపార నష్టం


నేలకొరిగిన వరి పంట

బొమ్మనహాళ్: భారీ వర్షాలకు మండలంలో పలువురు రైతులకు చెందిన పంటలు నీట మునిగాయి. రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. రాకపోకలు స్తంభించిపోయాయి. వేదావతి హగరి నది వరదతో బొమ్మనహాళ్ మండలంలోని ఏలంజి, మైలాపురం, కానాపురం, బండూరు, గోవిందవాడ తదితర గ్రామాల్లో సాగైన పత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప, వరి పంటలు దాదాపు 2 వేల ఎకరాలు నీట మునిగింది. మండలంలోని కల్లుదేవనహళ్లి, చంద్రగిరి, ఎలంజి, దేవగిరి, బండూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. కల్లుదేవనహళ్లి వద్ద వేదావతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తుండంతో దాదాపు 200 మీటర్లు వరకు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

నట్టల నివారణ మందు వేయించాలి


జీవానికి మందు వేస్తున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్

ఉరవకొండ: ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో పలు గ్రామాల్లో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ పర్యవేక్షించారు. అక్టోబర్ 16 నుంచి 30 వరకూ నట్టల నివారణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో 14.25 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

బెళుగుప్ప: జీవాల్లో ముఖ్యంగా గొర్రెలు, మేకల సంతతి అభివృద్ధికి నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని స్థానిక పశువైద్య కేంద్రం వైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆవులెన్న, బెళుగుప్ప, యలగలవంక, కోనంపల్లి గ్రామాల్లో పశు వైద్యసిబ్బంది జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. బెళుగుప్పలో 4,574, ఆవులెన్నలో 3,890, యలగలవంకలో 3,800, కోనంపల్లిలో 3,637 జీవాలకు మందు వేశామని పశువైద్యాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవులెన్న సర్పంచ్ రామ్మోహన్, పశు వైద్య సిబ్బంది ఎర్రిస్వామి, విజయ్, ఎర్రిస్వామి, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు రద్దు పొడగింపు

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం రూరల్: ఆధునీకరణ పనుల కారణంగా రాయదుర్గం మీదుగా నడిచే కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు రద్దును మరో నెలరోజుల పాటు రైల్వే అధికారులు పొడగించారు. నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దును పొడగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ రైలు గుంతకల్లు జంక్షన్ నుంచి నడుస్తుందన్నారు. తిరుపతి–కదిరిదేవరపల్లి(07589) రైలును నవంబర్ 1 నుంచి 30 వరకు, అలాగే కదిరిదేవరపల్లి–తిరుపతి(07590) రైలును నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు రద్దు చేస్తున్నట్లు సౌత్ వెస్టన్ రైల్వే అధికారులు తెలిపారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

కూడేరు: అపరిచితులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సీఐ శివరాముడు బాలికలకు సూచించారు. బుధవారం కూడేరులోని కేజీబీవీలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా బాలికలతో అసభ్యకరంగా ప్రవరిస్తే వెంటనే ఇంట్లో పెద్దలకు తెలియజేయాలన్నారు. లైంగిక దాడికి యత్నిస్తే ఎలా ప్రతిఘటించాలో వివరించారు. అలాగే పోలీసు వ్యవస్థ శాంతిభద్రతలను, ప్రజలకు రక్షణగా ఎలా నిలుస్తుందో తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఉమాదేవి, టీచర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న స్కందా వెంచర్ దగ్గర బుధవారం రాత్రి అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం రూరల్ మండలం కొడిమికి చెందిన అభిలాష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన వివరాలు మేరకు.. అభిలాష్ ద్విచక్ర వాహనంలో కూడేరు వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా స్కందా వెంచర్లో తిప్పాడు. దీంతో అభిలాష్ అదుపు తప్పి బొలెరోని ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

కూడేరు: మండల పరిధిలో చోళసముద్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై పలువురు రైతులు అర్జీలు అందజేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రెవెన్యూ రికార్డు మేరకు త్వరలోనే భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. కార్యక్రమంలో సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అంజనప్ప, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ ఆయూషా సిద్ధిక్, వీఆర్వో గోపాల్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నడక కూడా నరకం


గాంధీ స్కూల్ ఎదురుగా కంకరతేలి అధ్వానంగా మారిన రోడ్డు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని గాంధీ స్కూల్ ఎదురుగా ఉన్న వీధిలో రోడ్డు పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. వర్షాల కారణంగా రోడ్డు దారుణంగా తయారైంది. సీసీ రోడ్డు లేకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వర్షం వచ్చినప్పుడు కాలువ నుంచి బ్యాక్ వాటర్ రావడమేకాకుండా వర్షం తరువాత నీరు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండి పూర్తిగా కంకరతేలి నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉందని కాలనీవాసులు కబీర్, శ్రీనివాసులు తదితరులు వాపోతున్నారు.

ప్రారంభోత్సవం.. రెండోసారి!

- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన పనులకు మరోసారి ప్రారంభోత్సవాలు
- అధికారంలోకి రాగానే పనులు చేయకుండా అడ్డగింపు
- ఇటీవల కన్నేపల్లి- యాటకల్లు రోడ్డు పనులను ప్రారంభించిన వైనం
- 'సూపర్‌సిక్స్'ను ఏమార్చేందుకు టీడీపీ పన్నాగం


వైఎస్సార్‌సీపీ హయాంలో కన్నేపల్లి- యాటకల్లు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య (ఫైల్)

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ చేస్తున్న పనులకు ప్రజలు నవ్వుకుంటున్నారు. కేవలం ప్రజల్లో సూపర్ సిక్స్ పథకాల ప్రస్తావన రానీయకుండా స్థానిక టీడీపీ నేతలు ఆపసోపాలు పడుతున్నారు. ఇందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు తిరిగి టీడీపీ హయాంలో పనులు చేస్తున్నట్లు ప్రజలను మభ్య పెడుతున్నారు. ప్రారంభించిన పనులనే ఇలా ఎన్నిసార్లు ప్రారంభోత్సవాలు చేస్తారంటూ నియోజకవర్గ ప్రజలు విస్మయం చెందుతున్నారు.


వైఎస్సార్‌సీపీ హయాంలో...

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగానే కన్నేపల్లి– యాటకల్లు రోడ్డుకు, కన్నేపల్లి– భూపసముద్రం బ్రిడ్జి నిర్మాణాలకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను విడుదల చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి నుంచి యాటకల్లు వరకు జనవరి 15న వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, అప్పటి మాజీ మంత్రి శంకర్ నారాయణతో కలిసి సుమారు 24 కిలోమీటర్ల మేర(నాబార్డు నిధులతో మంజూరైన రూ.13 కోట్లు) తారు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అదే క్రమంలోనే బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి– భూపసముద్రం గ్రామ మధ్యలో రాకపోకలు సాధించేందుకు వీలుగా రూ.30 కోట్లతో బ్రిడ్జిని నిర్మించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో స్థానిక సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఎన్నికల ముందే మార్చి 14న పనులను ప్రారంభించారు.

25 శాతం పనులు చేయలేదన్న సాకుతో పనులు నిలుపుదల

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ చేపట్టిన పనులను ఎక్కడికక్కడే నిలుపుదల చేస్తూ ఆదేశాలిచ్చింది. పనులు పూర్తయితే అప్పటి ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందన్న అక్కసుతో పనులను ఆపేసింది. తర్వాత 25 శాతం పనులు చేయలేదంటూ టెండర్లను రద్దు చేసి తిరిగి ప్రారంభోత్సవాలు చేయడం కొసమెరుపు. సూపర్‌సిక్స్ హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో పథకాలపై ప్రజలను ఏమార్చేందుకు టీడీపీ పన్నాగం పన్నింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులనే తిరిగి ఇటీవల టీడీపీ పూర్తి చేస్తోందంటూ గొప్పగా మరోసారి ప్రారంభోత్సవాలు చేయడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా రెండు రోజుల క్రితం టీడీపీ నేతలు కన్నేపల్లి– యాటకల్లు రోడ్డును ప్రారంభించడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

విడ్డూరంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన పనులను టీడీపీ నేతలు తామే మంజూరు చేయించామని మరోసారి ప్రారంభోత్సవాలు చేయడం విడ్డూరంగా ఉంది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి దీర్ఘకాలిక సమస్య అయిన కన్నేపల్లి– యాటకల్లు మధ్య 24 కిలోమీటర్ల మేర పనులకు రూ.13 కోట్లు విడుదల చేయించారు. పనులు కూడా ఎన్నికల కోడ్ వచ్చే వరకు వేగంగా జరిగాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులను నిలిపి ఇప్పుడు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు.

– బి.మహదేవప్ప, కోనాపురం, బ్రహ్మసముద్రం మండలం

ఉపాధి పనుల కల్పనలో అలసత్వం వద్దు

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉపాధి పనుల కల్పనపై ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి గుర్తించిన పనుల వివరాలను కూలీలకు తెలియజేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కూలీలు పనులకు వచ్చేలా చైతన్య పరచాలని సూచించారు. పండ్ల మొక్కల సంరక్షణను రైతులు బాధ్యతగా చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ తులసీ ప్రసాద్,టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.